యక్షపరీక్ష

ప్రాచీన గాథాలహరి

వి. గణపతిశాస్త్రి

"అయ్యో! అయ్యో! నా యజ్ఞాగ్ని హోత్రానికి వినియోగించే అరణి ఆ మాయ జింక ఎత్తుకు పోతూంది! ధర్మమూర్తీ! మీరే నాకిక దిక్కు! రక్షించండి! రక్షించండి!"

అని ఆ బ్రాహ్మణుడు దీనంగా వలవలా వాపోయాడు! ధర్మరాజతని ఆర్తనాదం వింటూనే కళ్ళెత్తి అటూ ఇటూ పరిశీలించాడు. వెంటనే విల్లమ్ములు చేతబట్టుకుని ఆ జింక వెంటనంటి పరిగెత్తుకు పోయినాడు! మిగిలిన పాండవులందరు అన్నగారావిధంగా ఆత్రంగా పరిగెత్తుకు పోవడం చూసి తాము కూడా మరి వెనక ముందులు చూడకుండా విల్లమ్ములు చేత బుచ్చుకుని ఆ జింక వెంట వెంటనే పరుగులు పెట్టారు! పాండవుల అరణ్యవాసంలో వారి వెంటనున్న మిగిలిన పరివారంలో వారంతా ఏమి చేయడానికిన్నీ పాలుపోక రెప్పపాటు లేకుండా అలా నిలబడి పోయారు! ఇది అంతా ఒక్క క్షణంలో జరిగిపోయింది!

అప్పటికప్పుడే ఝాము పొద్దెక్కింది. అయినా ఎక్కడా ఎండ పొడకూడా చొరడానికి వీలులేని ఆ కీకారణ్యంలో పక్షులు, మృగాలు మేలుకున్న సందడి అప్పుడే ప్రారంభమయింది. పాండవులు తమ అమ్ములన్నీ ఒకటొకటిగా ఆ జింకమీద ప్రయోగించారు. అయినా అది చెంగు చెంగున ఆకాశంలోని కెగురుతూ అవ్వన్నీ తప్పించుకుని శరవేగంతో పరిగెత్తుకు పోతూంది! ఆ జింక కొమ్ములలో చిక్కుకున్న ఆ అరణిమాత్రం చెక్కు చెదరకుండా అలాగే మెరుస్తూంది. పాపం! ఆ బ్రాహ్మణుడా అరణి ఒక్క గున్నమామిడి కొమ్మలో భద్రంగా దాచుకున్నాడు. ఆ జింక ఎగురుతూ పరుగెత్తుతూంటే అది దాని చిలవలపలవల కొమ్ములలో చిక్కుకు పోయింది. దానితో అది అలాగే పరిగెత్తుకుపోయింది!

పాండవులయిదుగురు—"అయ్యో! ఒక్క జింకను వేటాడలేకపోయామే!" అని చాలా ఖిన్నులైపోయారు. అయినా నిరుత్సాహం చెందక చిట్టచివరి ప్రయత్నంగా అయిదుగురూ ఒక్కసారిగా బాణాలు వేశారు! ఆ దెబ్బతో ఆ జింక తలతెగి నేలమీద పడిపోయిందనే అనుకున్నారు. కాని అది చెంగున ఒక్క గెంతేసింది! అంతే! అది తిరిగి నేలమీద అడుగుపెట్టిన జాడ ఎక్కడా కనబడలేదు! ఏమైపోయిందో! ఆ అరణ్యంలో ఆ పరిసరాల్లో ఎంత గాలించినా దానిజాడే పొడగట్టలేదు!

ఈ అపూర్వ సంఘటన కందరుదిగ్భ్రాంతులైనారు! అయినా ఆ అయిదుగురు పాండవులు ఆ అరణ్యంలో ఆ ప్రాంతం అంతా కలయ వెదికారు. ఎక్కడా ఆ జింకజాడే కనబడలేదు!

ఇదంతా జరిగేసరికి మధ్యాహ్నం రెండు యామాలకాలం గడిచిపోయింది! మిట్టమధ్యాహ్నం ఎండ నడినెత్తి మాడ్చి వేస్తూంది. నిరుత్సాహంవల్ల, బడలికవల్ల అందరు అలసిపోయినారు. అతిదాహంవల్ల అందరి నాలుకలు పిడచగట్టుకు పోయాయి! కాని కనుచూపు మేరలో ఎక్కడా నీటిబిందువుకూడా కనిపించే ఆశలేదు! అందరు తమ దురవస్థా పరిపాకం తలుచుకుని దిగాలుపడిపోయారు.

"పాపం! ఆ బ్రాహ్మణునికి అరణికూడా దక్కించలేక పోయాముగదా! ఎంతటి మహావమానం!" అన్నాడు నకులుడొక దీర్ఘనిశ్వాసం విడిచిపెట్టి.

"ద్రౌపదీదేవిని ఆ విధంగా అవమానించినపుడు కౌరవులనందరినీ సంహారించివేసి ఉంటే ఇంతటి దురవస్థ సంప్రాప్తించి ఉండేది కాదుగదా!" అన్నాడు భీమసేనుడు తీవ్ర క్రోధంతో! అతని కన్నులు రెండూ రెండు కెంపులైనాయి!

"ఆ సూతపుత్రుడు—ఆ కర్ణుడు—నిండుసభలో ద్రౌపదీదేవి నావిధంగా దుర్భాషలాడుతూంటే సహించి ఊరుకోవడం వల్లనే— నేటికీ దుర్దశవచ్చింది! ఇది సహజమే!" అన్నాడర్జునుడు.

ధర్మపుత్రుడు వారి దైన్యవచనాలువిని లోలోపల చాలా కించపడ్డాడు. దాహం అలాగే అందర్నీ దహించివేస్తున్నది.

ధర్మరాజు "నాయనా! ఆ చెట్టుపైకెక్కి ఎక్కడైనా కనుచూపు మేరలో సరస్సేదైనా ఉన్నదేమో పరిశీలించిచూడు!" అన్నాడు నకులునితో.

నకులుడు అలిసిఉన్నా సరే లెక్కపెట్టక ఎదురుగాఉన్న పెద్ద చెట్టు చిట్టచివరికొమ్మ ఎక్కి చుట్టూ పరిశీలించి ఎంతో ఉత్సాహంతో కిందికిదిగివచ్చి—"దూరంలో ఒక పెద్ద సరోవరం కనిపించింది!" అన్నాడు.

"సరే! నీవే అక్కడికిపోయి దాహం తీర్చుకుని మాకింత మంచితీర్థం తీసుకురా! నాయనా!" అన్నాడు ధర్మరాజు.

నకులుడు చాలాదూరం నడిచిపోయినాడు. పోగాపోగా కొంతసేపటికి ఆ పెద్ద సరోవరం కనిపించింది. అప్పటికి దాదాపు మూడుయామాలు గడిచిపోయాయి. ఆ సరోవరానికి చుట్టూ దట్టంగా చెట్లు, తీగలు, పొదలు గజిబిజిగా అల్లుకున్నాయి. నకులుడు అవన్నీ దాటిపోయి ఎంతో సంతోషంతో ఆ సరస్సులో దిగినాడు. వెంటనే పెద్ద కంఠస్వరం వినిపించింది. ఆ ధ్వనికి చుట్టూ అడివిలోఉన్న లేళ్లు, దుండేళ్లు మొదలైన మృగాలన్నీ హడలెత్తి దూర దూరంగా పరిగెత్తుకు పోయాయి! సరోవరం ఒడ్డున తేలుతున్న మీనులన్నీ ఒక్కసారి తటాలున నీటిలో మునిగిపోయాయి! ఆ ధ్వని గంభీరంగా భయంకరంగా ఇలాగ వినిపించింది.

"నీవు మంచితీర్థం పుచ్చుకోవాలంటే ముందుగా నా ప్రశ్నల కన్నిటకీ ప్రత్యు

★ యక్ష పరీక్ష ★

త్తరా లివ్వాలి! అంతవరకు ఒక్క చుక్కైనా ముట్టడానికి వల్ల పడదు!”

ఈ మాటలు విని నకులు డొక్క క్షణ కాలం దిగ్భ్రాంతుడైనాడు. కాని దాహం వల్ల నాలుక పొంకర్లు పోతూంది. “ఈ బెదిరింపులకేమి లే!” అనుకుని ఒక్క గుక్కలో తాగ గలిగినన్ని నీళ్లన్నీ తాగి వేసినాడు!

అంతే! వెంటనే అతనికి మూర్ఛవచ్చింది. మొదలు నరికిన తరువులా అక్కడే పడి పోయాడు!

ఇక అక్కడ ఆ ఆశ్రమంలో మిగిలిన పాండవులు నలుగురు నకులుని కోసం వేచి వేచి విసిగి వేసారి పోయారు! ఇక చేసేదేమీ లేక ధర్మరాజు సహదేవుణ్ణి ఆ విషయం పరిశీలించ వలసిందని పంపించినాడు.

సహదేవుడు అప్పటికే శోష వచ్చి పడిపోయే పరిస్థితిలో ఉన్నాడు. అయినా త్వరితంగా ఆ సరోవరం ఉన్న ప్రదేశానికి బయలుదేరి వెళ్ళాడు.

తిరిగి సహదేవుని రాక కూడా చాలా ఆలస్యం అయింది. వెంటనే ధర్మరాజు అర్జునుని పంపించినాడు.

అతనికి కూడా ఆ సరోవరం దగ్గర ఆ అశరీరవాణి అలాగే అతి భయంకరంగా వినిపించింది. వెంటనే ఆ పరిసరం అంతా పరిశీలించి చూచాడు. నకుల సహదేవులిద్దరు ఆ ప్రాంతంలోనే పడి ఉన్నారు. అతని హృదయంలో విషాదము, క్రోధము సంభ్రమము ఒక్కసారిగా ఉవ్వెత్తుగా పొంగి పోయాయి! వెంటనే శబ్దవేధి శరం ఒకటి వింటసంధించి ఆ ధ్వని వినవచ్చిన దిశవైపున బాణం వేశాడు. కాని ఆ బెదరింపు తిరిగి అలాగే భయంకరంగా వినిపించింది, అర్జునుడిక దాహానికి తాళుకోలేక నీళ్లు తాగబోయినాడు. ఆ బెదిరింపు వినిపించినా లక్ష్య పెట్టకుండా ఒక గుక్కెడు నీళ్లతో నాలుక తడుపుకొన్నాడు. వెంటనే వివశుడై నేల మీద పడిపోయినాడు! పిమ్మట అలాగ ఆలస్యం జరిగిన కొద్దీ ధర్మరాజు మనస్సులో భయాందోళన లెక్కువైనాయి. వెంటనే భీమసేనుని పంపించాడు.

అప్పటికప్పుడే సాయంకాలం కావచ్చింది! ధర్మరాజలాగే అన్నదమ్ముల కోసం నిరీక్షిస్తున్నాడు. అతని హృదయంలో ఒకొక్క క్షణం ఒకొక్క యుగంలా గడిచిపోతూంది. చివరికి భీమసేనుని రాక కూడా బాగా ఆలస్యం అయింది.

గత్యంతరం లేక ధర్మరాజే ఆ సరోవరానికి బయలుదేరినాడు.

ఆ కమలాకరం తీరానికి చేరుకునే సరికి సూర్యాస్తమయం అయింది. అప్పుడే కొంచెం కొంచెం చీకటిపడుతూంది. సరోవరం అంతా నిశ్చలమై, ఒక పెద్ద వెండి అద్దంలా స్వచ్ఛంగా మెరిసి పోతూంది! ఎంత పరీక్షగా పరిశీలించినా అవతలితీరం కనిపించనంతటి విశాలతటాకమది! దానిలో అంతటా రంగురంగుల కలవలు అప్పుడప్పుడే వికసిస్తున్నాయి! చుట్టూరా గుబురులుగా పెరిగిన పెద్ద వృక్షాలా సరస్సులో ప్రతిఫలిస్తూ - అదికూడా ఆ అడవిలో ఒక భాగమేమో అనిపిస్తున్నాయి. ఇంతలో ఒక గుడ్లగూబ దిగులుగా కూసింది! పక్కనే ఒక తామరాకుమీద నిలబడివున్న కొంగ రెక్కలు మెరిపిస్తూ మెల్లిగా అక్కడి నించి ఎగిరిపోయింది. దాని రెక్కల వెలుగులా కొలనులో తళతళా మెరిసిపోయాయి.

సరీగా ధర్మరాజక్కడికి చేరుకునేసరికి శుద్ధచవితి వెన్నెల వెలుగులు కూడా తోడై ఆ జలాశయాని కొక విచిత్ర సౌందర్యం మేళవించాయి!

ధర్మరాజా అద్భుత తటాకం చూచి తన కన్నులే నమ్మలేకపోయినాడు! వెంటనే అతనికి ఆ పక్కగా పడిఉన్న భీమార్జున నకుల సహదేవులు కనిపించారు. ఆత్రంగా వారిని సమీపించాడు. వారందరు మృతులై వరసగా నేలమీద పడిఉన్నారు.

ఆ భీభత్సదృశ్యం చూసేసరికి ధర్మపుత్రునికి మరి తన దాహం మాటే జ్ఞాపకం రాలేదు! వారిదగ్గరకు వెళ్ళి జాగ్రత్తగా వారి ముఖకవళికలు పరిశీలించాడు. కొప్ప ప్రాయులై పడిఉన్న వారి ముఖాల్లో జీవకళ దృశ్యా దృశ్యంగానైనా పొడగట్టలేదు. ఈ ఘోర విపత్పరంపరకు కారకు లెవరో కూడా తెలియలేదు!

అతని హృదయంలో దుఃఖం ఒక్కసారిగా సముద్ర తరంగంలా పొంగి పరవళ్లు దొక్కింది! ‘ఈ అరణ్యవాసంలో తమ కష్టాలు గట్టెక్కె శుభ క్షణం మరి రాదా’ అనిపించింది ఆ ధర్మమూర్తికి! ముందు వారి ముఖాలమీద ఇంత శీతలోదకం చిలకరించాలనే తొందరతో ఆ తటాకంలో ప్రవేశించాడు! అవిధంగానైనా వారు జీవిస్తారేమోనని అతని ఆశ!

వెంటనే మేఘగంభీరస్వరంతో అభయంకర గర్జితం ప్రారంభమైనది! అధ్వని బయలుదేరగానే ఆసరస్సులో విశ్రమించిన పక్షులు టపటప రెక్కలాడిస్తూ పైకెగిరిపోయాయి! అశరీర వాణి గర్జన ఇలాగ వినిపించింది.

“నీ సహోదరులు నామాట నిర్లక్ష్యం చెయ్యడం వల్లనే ఈ దురవస్థ పాలైనారు. ఈ సరోవరం నాది! నా ప్రశ్నలకు ప్రత్యుత్తరా లిచ్చిన తరవాత దాహం తీర్చుకోవచ్చును! లేకపోతే ఎంతటి వారికైనా ఇదే దుర్దశ!”

ఎటు చూచినా ధర్మపుత్రుని కాపరిసరాల్లో ఎక్కడా మానవాకృతి కనిపించలేదు! తిరిగి క్షణకాలం ఆ సరోవరం అంతా పరిశీలించి చూచినాడు. కొంచెం ఆలోచించి—

“ఓ అశరీరవాణీ! ఎవరు నీవు?” అన్నాడు.

“నేనొక కొంగను!”

“అయ్యా! నీ శరీరం నా నేత్రాలకు గోచరం కావడం లేదు. నీవు ఒక రూపధరుడవైన రుద్రుడవో, పావకుడవో, పవన దేవతవో అయిఉండవలెను! కాని నాదు దేవాసుర గంధర్వాదుల కజేయులైన నా సోదరుల నీ విధంగా జయించలేవు!”

“ధర్మపుత్రా! నీవన్నది నిజమే సుమా! నేనొక యక్షుడనే!”

అని అతని కెదురుగా తాళవృక్షం అంతటి దీర్ఘ దేహంతో ఒక మహాపురుషుడు ప్రత్యక్షమైనాడు! అతని కోరలు చంద్రవంకల్లా తళతళ మెరుస్తున్నాయి! నేత్రాలు చింత నిప్పులా కణకణ లాడుతూ మండుతున్నాయి అతని శరీర కాంతులతో ఆసరో

“ఉన్నదేదో ఇస్తారని...”

“అయ్యా. పేదవాణ్ణి కాస్త సహాయం చేయించాలి.”

“గామాలా ఉన్నావు నీకు సహాయమేమిటోయ్. అయినా కాకపోయినా, నీ క్కావలసినది వెధవ డబ్బు సహాయం కాదు. బుర్రవుండాలి. తెలివితేటలు అవసరం.”

“అంటే మరేం లేదండి. మీ దగ్గిర ఉన్న దేదో, అందులో కాస్త ఇచ్చి సాయం చేస్తారుగదా అని ఆలోచించి, డబ్బే అడుగుతున్నానండి.”

ధర్మదేవత చల్లని వెలుగులు సరోవరంలోను, ఆ పరిసరంలోను అమృతవర్షం జల్లులుగా ప్రసరించాయి.

—చిత్రకారుడు : పి. ఎల్. నరసింహమూర్తి.

★ యక్షపరీక్ష ★

తరపరిసరమంతటా పున్నమి వెలుగుల వెల్లువలు నిండిపోయాయి!

ధర్మరాజతనికి నమస్కరించి "మహాత్మా! మీ ప్రశ్నలన్నిటికీ సముచితమైన ప్రత్యుత్తరాలిచ్చే సామర్థ్యం నాకు లేదు. నా శక్త్యనుసారంగా విన్నవించుకొంటాను." అన్నాడు.

యక్షుడు ధర్మరాజు నీవిధంగా ప్రశ్నించినాడు. వెంటనే అతడా ప్రశ్నలకు ప్రత్యుత్తరాలు ఇచ్చినాడు.

"సూర్యదేవుని నడిపించేదేది?"

"బ్రహ్మశక్తి!"

"ఆపత్పరంపరలో జీవుని రక్షించేదేది?"

"ధైర్యం!"

"ధరణికన్నా మహత్తరమైనది?"

"శిశు సంరక్షణ భారం వహించే జనని!"

"ఆకాశంకన్నా సమున్నతుడెవడు?"

"జనకుడు."

"గాలికన్నా త్వరగా పరిగెత్తేది?"

"మనస్సు"

"నిద్రించినా కన్ను మూయనిది?"

"మీను"

"జన్మించినా చైతన్యం లేనిది?"

"గుడ్డు"

"రూపమున్నా హృదయం లేనిది?"

"రాయి"

"వేగంవల్ల జీవించేది?"

"ఏరు."

పిమ్మట యక్షుడొక నిమిషం ఆగి మళ్ళీ ప్రశ్నించాడు.

"చివికి జీర్ణించిన తృణం కన్నా శిథిలమైనది?"

"చింతా వ్యాకులమైన హృదయం."

"మరణించిన జీవుని వెంటనంటి పోయే దెవరు?"

"ధర్మం"

"ప్రపంచంలో అత్యద్భుతమైన విషయమేది?"

"అనుక్షణము మానవులు యమునిలోకానికి ప్రయాణం అవుతూనే ఉన్నారు! అయినా మిగిలిన వారందరు మరి తామే కలకాలం జీవించాలని కాంక్షిస్తారు! ఇంతకన్నా మహాద్భుతమేది లేదు.!

ఒకటి విడిచివేసిన మనుష్యుడు మహైశ్వర్యవంతుడవుతున్నాడు! అది ఏది?"

"కోరిక"

"యథార్థమైన బ్రాహ్మణత్వ సిద్ధికి హేతువేది? జన్మమా? శాస్త్రాధ్యయనమా?"

"రెండూ కానేరవు! సత్ప్రవర్తనవల్లనే బ్రాహ్మణత్వం సిద్ధిస్తున్నది.!

"జీవన్మృతుడెవడు?" "బంధు భృత్యాదుల కన్నుగప్పి తానొకడే భోగాలనుభవించే క్షుద్రుడు!"

"గృహస్థునికి బంధువెవరు?"

"శీలవతియైన కళత్రం"

"బ్రాహ్మణునికి దేవత్వ సిద్ధికి కారణమేది?"

"వేద శాస్త్రాధ్యయనము"

"భూదేవుడు మానవుడుగా మారిపోవడానికి కారణం?"

"మృత్యుభయం!"

"అందరితోనూ ఆప్యాయంగా వర్తించాలంటే విడిచిపెట్టవలసిన వేవి?

"గర్వాహంకారాలు"

"ఈ లోకానికి దిక్కెవ్వరు?"

"సత్పురుషులు!"

"నిజమైన పురుషుడెవడు?"

"మహాకీర్తిశాలి."

ఈవిధంగా అడిగిన ఇంకా ఎన్నెన్నో ప్రశ్నలకు ధర్మరాజు వెనువెంటనే సమాధానాలిచ్చేసరికి యక్షుడెంతో ఆనందించి అతనితో ఇలాగన్నాడు.

"రాజా! నీవిచ్చిన సదుత్తరాలు విని ఎంతో సంతోషించాను. ఈ నలుగురిలో ఎవరినో ఒకరిని మాత్రమే బ్రతికింపగలను! వరం కోరుకో!"

ధర్మపుత్రుడు మృతులై పడి యున్న ఆ నలుగురి వైపు ఎంతో ఆప్యాయంగా చూచాడు. కొంతసేపటివరకు అతనికి మరి ఏమనడానికీ పాలుపోలేదు! చిట్టచివరకి — "మహా సౌందర్యశాలి నకుల కుమారుని బ్రతికించుకోవాలని నా కోరిక!" అన్నాడు.

యక్షుడా సమాధానంతో ఎంతో ఆశ్చర్యపడి "భీమార్జునులు నీ కత్యంత ప్రేమపాత్రులుగదా! వారి నేల కోరలేదు!" అన్నాడు.

"మా తల్లి సంతానంలో నేనొకణ్ణి జీవించి ఉన్నానుగదా! "మరి మాద్రీదేవి సంతానంలో ఒకరైనా ఉండవద్దా? మహాత్మా! నీకు తెలియని ధర్మమేమున్నది?"

ఈ సమాధానం విని యక్షుడింకా ఆనందించి ఇలాగన్నాడు. "ధర్మరాజా! ఈ మాట అనగలిగిన ధర్మవేత్తవు నీ వొక్కడవే! నీ ధర్మనిష్ఠ నాకెంతో ఆనందం కలిగిస్తున్నది. నీ సోదరులందరు వెంటనే పునర్జీవితులై జీవిస్తారు! అదిగో చూడు!"

ఆ క్షణంలోనే మిగిలిన పాండవులందరు గాఢ నిద్రపోయి మేల్కొన్నట్లుగా లేచి నిలబడ్డారు!

ధర్మరాజానంద కల్లోలం మునిగి తేలుతూ ఇలాగన్నాడు :

"అయ్యా, నీవు యక్షమాత్రుడవు కానేకావు! సందేహం లేదు!"

"అవును! నేను యక్షుడను కానిమాట యథార్థమే! నీ ధర్మ పరీక్షార్థమై వచ్చిన ధర్మదేవత నే! తిరిగి నీకింకొక వరం ప్రసాదిస్తున్నాను. నీ అభీష్ట మేదైనా సరే! కోరుకో!"

దానిమీద ధర్మరాజు "పాపం! ఆ బ్రాహ్మణుని అరణి ఆ మృగం అపహరించుకుపోయింది. ఆ అరణికంటే మరి నాకు కోరదగిన దేదీ లేదు." అన్నాడు.

ధర్మదేవత చల్లని వెలుగు లా సరోవరములోను ఆ పరిసరంలోను అమృతం వర్షం జల్లులుగా ప్రసరించాయి. అతడు ధర్మరాజు నీ విధంగా ఆశీర్వదించినాడు.

"నాయనా! నా అంశంలో అవతరించిన నీ ధర్మ నిరతికి దేవతలు పుష్పవర్షం కురిపిస్తున్నారు! మృగ రూపంలో ఆ అరణి అపహరించి నిన్నింతగా క్లేశ పెట్టినదీ నేనే! ఇదిగో ఆ అరణి! తీసుకో! నీవు వరమేదీ కోరకపోయినా—అజ్ఞాతవాసంలో మీ రే రూపాలు ధరించాలని కోరినా ఆవిధంగా మీ కా రూపాలేర్పడేటట్లు వరం ఇస్తున్నాను! మీ అందరి ధర్మనిరతికీ శుభం కలుగుగాక!"

అని వెంటనే అదృశ్యమై పోతూన్న ధర్మదేవత మీద, పాండవుల మీద పరిసర వృక్షాలు, లతలు రంగు రంగుల పూలవానలు జల్లులు కురిపించాయి! ★

15 జ్యూయల్సు చేతిగడియారం రు. 5



స్విస్ తయారీ. 15 జ్యూయల్సు వాస్తవికమైన చేతి గడియారం. 16 ఏళ్ళ గ్యారంటి. ధర రు. 5. పోస్టేజీ రు. 1/8- అదనం. Swiss Watch Suppliers P. B. 1392, (A. P. M.) Delhi.

నాణ్యతకు ప్రసిద్ధి చెందినవి!

ఎస్. ఆర్. మిస్కి ఇంగువ, కర్పూరపు బిళ్లలు, స్పెషల్ జవ్వాదువత్తులు.

బాలకృష్ణా ఇండస్ట్రియల్ వర్క్సు, మద్రాసు 13.

సేల్సు ఆఫీసు: 27, స్ట్రింగ్‌టన్ ముత్తయ్యముదలివీధి, మద్రాసు-1.